క్లుప్తంగా

కళ్లే లలిత విగ్రహావిష్కరణ



లలిత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న భూలక్ష్మి

విజయవాడ స్పోర్ట్స్: నగర ప్రముఖురాలు కళ్లే లలిత ప్రథమ వర్ధంతిని సింగ్‌నగర్‌లో గురువారం నిర్వహించారు. కళ్లే లలిత విగ్రహాన్ని ఆమె భర్త నాగేశ్వరరావు ఏర్పాటు చేశారు. వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న లలిత స్నేహితురాలు బి.భూలక్ష్మి చేతుల మీదుగా విగ్రహాన్ని ప్రారంభించారు. మంచికి, స్నేహానికి మారుపేరుగా లలిత ఉండేదని ఆమె స్నేహితురాళ్లు, బంధువులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో లలిత కుమార్తెలు సీతామహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి, అల్లుళ్లు హరీష్, కిరణ్‌కుమార్, నూతన్‌కుమార్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

సోనోవిజన్‌లో టీసీఎల్ గూగుల్ టీవీ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీసీఎల్ తమ వినియోగదారుల కోసం మార్కెట్‌లోకి తీసుకువచ్చిన సరికొత్త గూగుల్ టీవీని సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి ఆవిష్కరించారు. ఏలూరు రోడ్డులోని సోనోవిజన్ విజయప్లాజాలో గురువారం టీవీని ఆవిష్కరించారు. కంపెనీ ప్రతినిధులు గూగుల్ టీవీ ఫీచర్స్‌ను వివరించారు. గూగుల్ టీవీ 32 అంగుళాలు, 43, 55, 65, 75 అంగుళాలు ఆపై సైజుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్, షోరూం మేనేజర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర పరేడ్‌కు తేజస్వీకి ఆహ్వానం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాకు చెందిన డాక్టర్ బాణావతు తేజస్వీకి న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి వీక్షించే అవకాశం రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ తేజస్వి గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి బాక్స్ నుంచి గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు 50 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరిలో నగరంలోని గుణదల ఎస్టీఆర్ కాలనీకి చెందిన డాక్టర్ తేజస్విని ఎంపిక కావడం అభినందనీయమన్నారు. తేజస్వీ ఎంబీబీఎస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి 6 గోల్డ్ మెడల్స్ అందుకున్నారని చెప్పారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా, తల్లి సామాన్య గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దారన్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు.

మోపెడ్ చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పెట్టిన మోపెడ్ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట వాగు సెంటర్‌కు చెందిన కురెంద దావీదు కూలీ పనులు చేస్తుంటాడు. ఈ నెల 8న ఇంటి ముందు పెట్టి తాళం వేశాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి చూసే సరికి మోపెడ్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పేదల అభ్యున్నతికి నవరత్నాలు దోహదం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



25వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 25వ డివిజన్ 96వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలదేవితో కలిసి గడప గడపకు పర్యటించారు. తాడిచెట్ల వారి బజార్, మూర్తి వీధి, కోకా వారి వీధి, గార్లపాటి వారి వీధి, రామస్వామి వారి వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మూడున్నరేళ్లలో రూ.310 కోట్ల సంక్షేమం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండటంతో కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని చెప్పారు. పర్యటనలో భాగంగా అర్హులైన పలువురికి రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను మంజూరు చేశారు. తాడిచెట్ల బజార్, మూర్తి వీధుల్లో దెబ్బ తిన్న రోడ్ల పునర్నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నగదు బదిలీలు గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ రాజ్యంలో నియోజకవర్గ ప్రజలకు రూ.310.46 కోట్ల సంక్షేమాన్ని అందించామని చెప్పారు.

అసత్య ప్రచారం చేస్తే ఉపేక్షించేది లేదు

సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలన చూసి ఓర్వలేక ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు చంద్రబాబు, టీడీపీ నేతలు విష ప్రచారం సాగిస్తున్నారని ఎమ్మెల్యే విష్ణు మండిపడ్డారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. రాక్షస ఆనందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు పోలీస్ వ్యవస్థపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలను, జీఓలను గౌరవించాల్సిన బాధ్యత.. ప్రతిపక్ష నేతగా చంద్రబాబుపై ఉందని తెలిపారు. మరో వైపు ముఖ్యమంత్రిపై సామాజిక మాధ్యమాల్లో తెలుగుదేశం సోషల్ మీడియా చేస్తోన్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత విమర్శలు, దాడులకు ఏ మాత్రం స్థానం లేదన్నారు. రెచ్చగొట్టే పోస్టులు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమని.. ఇష్టానుసారంగా తప్పుడు వార్తలను వైరల్ చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, నాయకులు బంకా భాస్కర్, నాగేశ్వరరెడ్డి, రఫీ, అబ్దుల్ నజీర్, అలీ అన్సారీ, కోలంటి రవి, చినబాబు, భోగాది మురళి, బెజ్జం రవి, కనపర్తి కొండా, బంకా వెంకటేష్, లతీఫ్, వి.బి.ఆచారి, బాషా, బబ్లూ, లక్ష్మణ పాల్గొన్నారు.

ఏడాదికి 12 వేల యూనిట్ల రక్తం సేకరణే లక్ష్యం

కలెక్టర్ ఢిల్లీరావు



సంచార వైద్య వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డాక్టర్ సమరం తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏడాదికి 12 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సంచార వైద్య వాహనాన్ని గాంధీనగర్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనం నుంచి కలెక్టర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగుల సౌకర్యార్థం విజయవాడ సూర్యారావుపేటలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రెడ్ క్రాస్ సేకరించిన రక్తాన్ని మాత్రమే రోగులకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖను మరింత పటిష్ట పరచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా రెడ్ క్రాస్ సేవలను రోగులకు చేరువ చేయాలన్నదే తన లక్ష్యం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యూత్ రెడ్ క్రాస్‌ను ప్రోత్సహించి ప్రతి కళాశాలలోనూ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. సంచార వైద్య వాహనం ద్వారా వైద్య బృందం జిల్లాలో పర్యటించి రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తామని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఇళ్ల రవి, మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ టి.సునీత, రెడ్ క్లాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు ఆచరణీయం



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానందుని మార్గం ఆచరణీయమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రాఘవయ్య పార్కు వద్ద జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'మానవ సేవే మాధవ సేవ' అన్న వివేకానందుని బోధన సారాన్ని ఆదర్శంగా తీసుకొని యువత సేవామార్గంలో పయనించాలని కోరారు. వివేకానంద స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ యువతకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత ఆత్మ విశ్వాసంతో లక్ష్యం వైపు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈఓ శ్రీనివాసరావు, నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బంకా శకుంతల, భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో..

బందరు లాకులు సమీపంలో ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానంద యువతకు స్ఫూర్తిప్రదాత అన్నారు. గ్రంథాలయాధికారి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు. రామ్మోహన గ్రంథాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు వివేకానంద గురించి పాఠకులకు వివరించారు.

విశ్వబ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట పాత బస్టాండ్ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ యువజన సంఘం కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చిప్పాడ చందు, శ్రీనివాస చారిటీస్ చైర్మన్ శ్రీనివాస్, శనగ పాడు జయలక్ష్మి, కె.రామారావు, వేణు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి



వృద్ధులకు అన్నదానం చేస్తున్న సొసైటీ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానవ జీవితంలో వృద్ధాప్య దశ ఎంతో కీలకమైనదని, నిరాశ్రయులైన వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ అన్నారు. ఆ సొసైటీ ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమ సేవా సంస్థలోని వృద్ధులకు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి కుటుంబ సభ్యుల ఆదరణ ఎంతో అవసరమని, అయితే నేటి సమాజంలో చాలా మంది వృద్ధులు నిరాశ్రయులుగా మారుతున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు దూరం అవుతున్న నేపథ్యంలో కుటుంబ బాంధవ్యాలు తగ్గిపోతున్నాయని చెప్పారు. తమను పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించాల్సిన వారే అనాథ ఆశ్రమాల్లో, రోడ్లపై వదిలేసి వెళ్లడం అత్యంత బాధాకరమన్నారు. వృద్ధాశ్రమాల ద్వారా ఇలా నిరాదరణకు గురైన వృద్ధులను చేరదీసి, వారి బాగోగులు చూడడం అభినందనీయమన్నారు. సొసైటీ ఉపాధ్యక్షులు కనకాల ప్రసాద్, మండా రాము, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సహాయ కార్యదర్శి గోకర్ణేశ్వరరావు, విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

'సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్న పవన్ కళ్యాణ్'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చి సామాజిక న్యాయం సాధించే దిశగా సీఎం వైఎస్ జగన్ ప్రయత్నిస్తుంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుతో చేతులు కలిపి పేదలకు అన్యాయం చేస్తున్నారని ఉభయ తెలుగు రాష్ట్రాల నూర్ బాషా ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓ.రసూల్ సాహెబ్ అన్నారు. స్థానిక స్వర్ణ ప్యాలెస్ హోటల్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదల అభ్యున్నతిని ఏనాడు కాంక్షించని చంద్రబాబునాయుడుతో పవన్ కళ్యాణ్ చెలిమి చేయడం వలన అటు కాపులతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. టీడీపీకి మద్దతు ఇవ్వడం ద్వారా పవన్ కళ్యాణ్ ఏమి కోరుకుంటున్నారో రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రయోజనాల కంటే సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న కక్షతోనే చంద్రబాబుతో చేతులు కలిపారన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల బాజీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబేలా 40 ఏళ్లుగా ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయటం అభినందనీయమని ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో గురువారం సాయంత్రం గుడిపాటి దత్తు, గుడిపాటి సీతారామ్ ఆధ్వర్యాన కార్పొరేటర్ బి.జానారెడ్డి సహకారంతో ముగ్గుల పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటా సంక్రాంతి వేడుకలు జరిగేలా పాలన సాగిస్తున్నామన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు చాటేలా గత 40 ఏళ్లుగా సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, బి.జానారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో 100 మంది మహిళలు పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్, ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ యార్డు సభ్యురాలు అమ్ముల హరిప్రియ, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, 28వ వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండ తదితరులు పాల్గొన్నారు.



యూరోకిడ్జ్ పాఠశాలలో వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మారుతీనగర్‌లోని యూరోకిడ్జ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంక్రాంతి విశిష్టతను పాఠశాల డైరెక్టర్ ఎన్.ప్రసన్న విద్యార్థులకు వివరించారు. అనంతరం చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ భోగిమంటలు వేస్తూ సందడి చేశారు. అనంతరం చిన్నారులకు భోగిపండ్లు పోశారు.

వైభవంగా కూడారై వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన 1008 లఘు గంగాళాలతో పాయస నివేదన (కూడారై) చేశారు. ఈ సందర్భంగా పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్య శ్రీహరి కూడారై విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్ చలసాని సూర్యప్రకాశరావు స్కూల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పౌష్టికాహారం అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అంగన్‌వాడీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, రామిరెడ్డి, బోరా బుజ్జి, రమేష్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోగిపండ్లు పోసి, వేడుకలు నిర్వహించారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పించిన మాజీ ఎంపీ గంగరాజు, షాహీనా సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తన రచనల ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరికీ దేశంపై ప్రేమను, ఆధ్యాత్మికతపై మక్కువను పెంచిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని, నేటి యువతకు ఆయన స్ఫూర్తిప్రదాత అని మాజీ ఎంపీ, శ్రీరామకృష్ణ సమితి గౌరవ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు అన్నారు. స్వామి వివేకానంద 160వ జయంతి, జాతీయ యువ దినోత్సవాలు సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ హైస్కూల్ ఆవరణలో గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవిత ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ స్వామి వివేకానంద రచనలు మనలోని ఆలోచనలకు పదును పెడతాయని, దేశ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. ముందుగా స్కూల్ ఆవరణలో ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో శోభాయాత్రను నిర్వహించారు. శ్రీప్రణవానంద భారతీ స్వామి, స్వామి వివేకానంద శిష్యురాలు కుమారి జాలాది రిషితలు పాల్గొని వివేకానంద సందేశాలను అందించారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు ఏవీఆర్ ప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ స్వామి సంగీత మహోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం నిర్వహించిన సంగీత మహోత్సవాలు భక్తిరసభరితంగా సాగాయి. నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి రచించి, స్వరపరచిన ఉత్సవ సంప్రదాయ కీర్తనలను ఆలపిస్తూ త్యాగరాజస్వామి,ఆంజనేయ స్వామి విగ్రహాలతో నగర సంకీర్తనం నిర్వహించారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథశాస్త్రి, విష్ణుభొట్ల సోదరీ మణులు,పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, పి.గాయత్రీ గౌరీనాథ్‌తో పాటు 100 మంది సంగీత కళాకారులు పాల్గొన్నారు. కచేరీల్లో భాగంగా లక్ష్మీప్రణతి, ముద్రాద్రి వైష్ణవి, రావినూతల శ్రీవైష్ణవి, తాటిమేటి శుభ, పొన్నపల్లి రమా భగవాన్, లంక తేజస్వి త్యాగరాజ స్వామి కీర్తనలను ఆలపించారు.

నగరంలో సంక్రాంతి సందడి



నగరంలో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. భవానీ ఐలాండ్‌తో పాటు నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకలు ఆకట్టుకుంటున్నాయి. నిత్యం బిజీగా ఉండే యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.



శరవేగంగా అంబేడ్కర్ స్మృతివనం పనులు



నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఏర్పాటు చేసే బూట్లు ఢిల్లీ నుంచి నగరానికి గురువారం చేరుకున్నాయి. సుమారు పది అడుగులకు పైగా ఎత్తుండే ఈ బూట్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పల్లెకు పయనం





సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు పల్లె బాట పట్టడంతో విజయవాడ బస్టాండ్, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.